# బిచ్చం

'ఏమీ కొంపలు మట్టిగొట్టుకుపోతాయ్. నట్టిళ్ళ జిల్లేళ్ళు మొలుస్తాయి. ఊరు పాడుబడిపోద్ది. ఏడేడు తరాలు నరకాన బడత్రై' అని డొంకలో నిలబడ్డ శివరామకృష్ణస్వామి పంచ ఎగదోపి దోసిళ్ళలోకి దుమ్మెత్తుకొన్నాడు.

సద్ది తిని గొడ్డు దోలుకొని గరువుకు మేపటానికి పోతున్న పోతురాజు స్వామి తిట్లు విన్నాడు. 'స్వామి! స్వామి ఆగు' అన్నాడు. దోసిట్లో దుమ్ము ఊరిమీద చల్లకుండా నిలబడ్డాడు స్వామి

'సోఁవీ! శాపం బెడతన్నా? నీ శాపం తగులుద్దని ఊళ్ళో వోళ్ళకి దడ! ఏమయింది సోఁవీ?'

నాలుగు బజార్ల కూడలిలో గాంధీ బొమ్మ దగ్గర నిలబడ్డ స్వామి రాజును చూసి, ఆరుత్తావా, తీరుత్తావా, అక్కరొత్తే మూలుగుతావా, నీకెందుకోయ్. పోవామ్ పో అన్నట్లు తుస్కారంగా చూశాడు.

కళ్ళు ఎర్రగా ఉన్నై . ముఖం గద్దరించి ఉంది. ఉదయం పూట ఎండతగిలి వళ్ళు సుర్రుమంటున్నట్లుంది. చొక్కాలేదు. చంకలో ఖాళీ జోలె ఉంది. కోపంగా ఉన్నాడు.

'ఏమయింది సోఁవీ ఊరినే నాసినం గమ్మంటున్నావే! ఇది నీ పిల్లలు, నువ్వు, తండ్రి, తాత, ముత్తాత ఆ ముందోళ్ళంతా పుట్టి నూరు గాదా! ఊరు నాసినమైతే నువ్ బతుకుతావా? ఏంది సోఁవీ కోపం'.

'నువ్వేం జేయగలవ్రా?'

'యాఁవన్నా జేత్తా సోఁవీ'

'ఏమీ తినక ఏడురోజులయింది!'

'బువ్వా?'

'అఁ!'

'జబ్బా సోఁవీ!'

'లేక. ఎవరూ భిక్ష వేయక. అన్నం పెట్టక'.

'బువ్ నేను బెట్టనా సోఁవీ!'

'ఆఁ!'

గొడ్డు గురువు దోవబట్టి పరంజుతున్నై, పోతురాజు లగెత్తుకెల్లి వాటిని మల్లేశాడు. అవితిరిగి ఇంటిముఖం పట్టాయి. దొడ్లో తోలాడు. పంగల కర్ర అడ్డం పెట్టాడు.వాటికి పస్తు ఇవాళ.

శివరామకృష్ణ స్వామి దగ్గరకు వచ్చాడు, పోతురాజు. 'మాయింటికి పోదాంరా సోఁవీ' అన్నాడు

స్వామి దోసిట్లో దుమ్ము అలాగ్గే ఉంది. అది ఉరిమీద చల్లితే, మూడు దోసిళ్ళు చల్లితే, శాపం పూర్తి అవుతుంది. శాపం రెండు భాగాలు. వాక్కు, చర్య. వాక్కు పూర్తయింది. చర్య ఆగిపోయింది. ఆ దుమ్ము ఊరిమీదికి గాలిలోకి లేస్తే చర్య ప్రారంభమవుతుంది.

పోతురాజు అన్నంపెడతా నన్నందువల్ల, చేపట్టిన చర్యను స్వామి మొదలుపెట్టలేదు.

'దుమ్ము పారెయ్ సోఁవీ!'

'చర్య మొదలైనట్లే, దుమ్ము విరజిమ్మితే'

'మరెట్టా సోఁవీ!'

'ఇట్లాగే వస్తా'

'వొచ్చి?'

'పల్లెలో పాడుబడ్డ బావిలో పడేస్తా'

'ఆ బాయిలో ఈ ఎండాకాలం నీళ్లుండవు గానీ, వానలొత్తే ఒకటే ఊట. పిడికెడు జల! ఈ దుమ్ము పడితే అది యేటెల్లకాలం యెండిపోద్ది. మా ఉసురుకొట్టుకొంటుంది. అడొద్దు సోఁవీ. మా బిడ్డలికి, గొడ్డుకి గొంతెండిపోద్ది.'

'ఊరును శపించాను. పల్లెను కాదు. పల్లెలో పడబోస్తే ఏమీకాదు'.

'మీ మాట మా దొడ్డది సోఁవీ. మా పల్లెలోకి ఈ దుమ్మొద్దు. ఊరినంటే ఒకటీ, పల్లెనంటే ఒకటీనా?'

'ఊరిమీదా చల్లక, పల్లెమీదా వేయక, నా నెత్తిన వేసుకోనా?'

'సోఁవి సోఁవీ అట్టాటి మాటనొద్దు. నా పంచెలో పడెయ్' కట్టు పంచ చెంగు పీకి చూపాడు.

'శాపం నీకు తగులుతుంది'

'యేం పర్వాలేదు. ఊరికీ పల్లెకీ శాపం తప్పితే అదే పదేలు!'

'నువ్వు నాశనమైపోతావ్'

'నాకేందుంది? తాడా బొంగరంవా?. పిల్లా జెల్లా లేరు. పెళ్లీ పెటాకుల్లేవు, గోసీ గొంగడీ లేవు. యేం ఊడుద్ది. ఈడబోయ్!'

'నీ ప్రాణానికి ప్రమాదం!'

'పేణంవా? అదుంటే యెంత? ఊడితే యెంత? ఇటు బడెయ్ సోంవి'.

'నా చేతులాటటం లేదు రాజు!'

'నా సెంగాడతావుంది సోంవీ. మీకేం యిదొద్దు. యీడ బడనూకు!'

'శివరామకృష్ణస్వామి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ వాక్కు న్యాయమే! ఈ చర్య అన్యాయం. నేనీపని చేయలేను'

'మరి దుమ్మేం జేత్తా?'

'దిక్కు దెలియటం లేదు'

'మీకేం దిగులొద్దు. మీరు నన్ను తాకొద్దు. ఈడ ఇసరండి. మీరు ఇసరకపోతే నేను మిమ్మల్ని, మీ ఏదాలు పట్టుకొన్న సేతుల్ని, తాకాల్సొస్తది'

'నేను దుమ్ము వేయలేను'

'నేను యేసుకుంటా' స్వామి. రెండు చేతులూ, దోసిలీ రాజు పట్టుకొని ఆ దుమ్ము తన కట్టుపంచ చెంగులో వేసుకొని మూటగట్టి, బొడ్లో దోపుకొన్నాడు. 'ఇంక బా సోం వీ!' అన్నాడు.

స్వామి కళ్ళలోంచి రెండు కన్నీటి బొట్లు జారి కాళ్ళమీద పడ్డాయి.

'నువ్వు శాపం మూటగట్టుకొన్నావు. నేను నీకు పాపం అంటగట్టాను. నేను తప్పు చేశాను' స్వామి దిగులుపడ్డాడు.

'బలే వోడివిలే సోంవీ. పోదాం పా' అంటూ బయలుదేరాడు. ముందు స్వామి, వెనుక రాజు పల్లెవైపు నడుస్తున్నారు, డొంకలో,

'మనిసి శాపానికింత మాత్తెంవుంటే, పిల్లి శాపానికి ఉట్లు తెగుతాయా సోంవీ!'

శివరామకృష్ణ స్వామి మాట్లాడలేదు.

'తెగితే ఆటికి పాలూపెరుగేంకర్మ సోరగం దిగిరాదా? వచ్చుద్ది! ఉట్లు తెగితే మేడలు మిద్దెలు కొంపాగోడీ నిలుత్తాయా? మాత్తెమాలంటా మనుసులు పిచ్చోళ్ళు గాటంగాపోతే'

శివరామకృష్ణ స్వామి రాజు ముఖంలోకి తేరిపార జూస్తూ డొంకలో జారబోయి నిలదొక్కుకొని నడుస్తున్నాడు.

'శబ్దానికి శక్తి ఉంది. విదగ్ధ హృదయం నుంచి, దగ్ధస్వరం వెలువడితే శబ్దం శాపమవుతుంది'

'నేను ఎన్నిసార్లు ఎందరికి శాపనార్థాలు పెట్టలేదు సోంవీ! ఏదీ జరగందే!'

'శబ్ద శుద్ధి లేదు నీకు'

'మనసుకంటే మాట గొప్పదా సోంవీ'

స్వామి మాట్లాడలేదు.

వాడి దుమ్ముమాట రాజు మోకాళ్ళకు కొట్టుకొంటూ ఉంది.

రాజు తల్లీ తండ్రీ బాల్యంలో గతించారు. ఎవరూ పెళ్ళి చేయలేదు. అప్పటి నుంచి జీతగాడు గానే ఉన్నాడు. ఆసామి ఇంటో ఏమయినా పెడితే తింటాడు. లేకపోతే ఇంట్లో వండుకొంటాడు. ఒంటిగాడు. చేయి కాల్చుకోబుద్ధి పుట్టకపోతే ఖాళీ కడుపుతో పడుకొంటాడు.

శివరామకృష్ణ స్వామి తండ్రి పూజారి. తా నొక్కడే కొడుకు. నలుగురు, తన పిల్లలు. కడుపులు చేతబట్టుకొని దేశంమీద పడ్డారు. గుళ్ళో పూజలులేవు. భార్య చలిజ్వరంతో చనిపోయింది. ఉంఛవృత్తి తనకు తగిందే! బియ్యం, పప్పులు యాచన. అన్నమయినా ఫర్వాలేదు. గుడిపాడుబడింది. కూటికి జరగటంలేదు. అయిదేళ్ళ నుంచి క్షామం. అన్నం పుట్టటంలేదు. రైతులు పల్లెవదిలి పట్నం చేరి బతుకుబండి ఈడుస్తున్నారు.

ఊళ్ళో ఏడు నాళ్ళనుంచి కూడులేదు. బిచ్చంలేదు. అన్నం ఆశతో పల్లెకు వచ్చాడు స్వామి.

రాళ్ళు, కట్టెలు, బియ్యం, కందిపప్పు, ఉప్పు, కారం, చింతపండు పాత్రలు తెచ్చి ఇచ్చి వండుకో సోంవీ' అన్నాడు రాజు.

'వండుకోను!' అన్నాడు స్వామి

రాజు గుడిసె ముందు చేపచెట్టుకింద రోటి మీద కుందు కూర్చున్నాడు స్వామి.

ఎండాకాలం. రోళ్ళేమీ పగలటంలేదు. ఎండమాత్రం కొండల గుండెలు కరిగిస్తుంటే, మనుషులకు చెమటపడుతూ ఉంది.

'ఐదేళ్ళు కరువు సోంవీ' అన్నాడు రాజు. వింటున్నాడు స్వామి. 'ఏడు రోజులు కూడులేక మాడితేనే మాటల్లో మంటల్లేత్తే యెట్టా సోంవీ!

'ఐదేళ్ళ నుంచి అల్లాడేవోళ్ళు యేంవనాలి? యెవర్నునాలి? యెట్టా శాపం బెట్టాలి?'

స్వామి ఆలోచనలో పడ్డాడు

'వంట వద్దంటే యెట్టా సోఁవీ?' అని అడిగారు.

'అన్నం పెట్టు! అన్నం పరబ్రహ్మ స్వరూపం!'

'మా యిళ్ళకూడు తినేదేనా? తినొచ్చా? అపచారంకాదా!

'అన్నార్తుడికి అన్నం పెట్టటంలో అపచారం లేదు. అన్నానికి అంటులేదు'

తెచ్చినవన్నీ మళ్ళీ గుడిసెలోకి తీసుకుపోయి, పొయ్యి ముట్టించే పనిలో పడ్డాడు.

స్వామి గుడిసెలో పొగలేవటం చూశాడు. రాజు వంటచేసే పనిలో పడ్డాడని గ్రహించాడు. ఆకలి రథయాత్ర ఊపందుకొంది.

స్వామి రోటిమీంచి లేచాడు. చెట్టునీడ వదిలాడు. కాళ్ళు తేలిపోతున్నై ముందుకు వచ్చి గుడిసెలోకి తొంగి చూశాడు. 'రాజూ!' పిలిచాడు. 'ఆఁ!' అన్న రాజు వెలుపలికి వచ్చి 'ఏం సోఁవీ' అన్నాడు.

'అన్నం వండవద్దు. అన్నం ఉంటే, ఉన్న అన్నం పెట్టు'

రాజు నోటి వెంట మాటలేదు. నోరు పడిపోయినట్లే. మాట పెగల్లేదు. వణికిపోయాడు.

'సద్ది!' గుండె కూడదీసుకొని అన్నాడు.

'ఫరవాలేదు పెట్టు!'

'కూరలేదు!'

'అక్కరలేదు'

'పాచిపోయింది!'

'ఇబ్బంది లేదు'

'ఏ దేముడు మీ అవతారమెత్తి నన్ను పరీచ్చిత్తన్నాడు సోఁవీ?'

'దేవుడు కాదు, మనిషే. సాటి మనిషిని బిచ్చం అడుగుతున్నాడు'

స్వామి రోటిమీద కూర్చున్నాడు. రాజు కూటిమల్ల తెచ్చి రోటిమీద పెట్టాడు. 'రాత్రిది. పొద్దన్నె సద్ది తిన్నా కొంత. ఇది మిగులుసుకున్నా మాపిటేలకి!'

'నాకు పెడితే నీ కుండదా?'

'దొరసాని పెట్టుద్ది!'

'గొడ్డు కాయలేదుగా ఇవ్వాళ. పెడుతుందా?'

'పెట్టదేమో!'

'నేను తింటే నీకుండదు. శాపం వడిగట్టేనుగా అది నెరవేరుతుంది'

'ఒక్క పూటేగా. పర్వాలేదు'

మల్లలో అన్నంతాకకుండా, ముంతలో నీళ్ళు తాగాడు స్వామి. 'నీ అన్నం నువే తిను' స్వామి మూతి తుడుచుకొంటూ లేచాడు.

ఎండ నడి నెత్తిమీదికి వచ్చింది.

'తిను సోఁవీ!

'తిన్నట్టే! నీ భక్తితో నా కడుపు నిండింది. నీవంట వాళ్ళవల్ల ఈ ఊరు బాగుంటుంది. బాగుపడుతుంది. వానలు కురుస్తాయి. పంటలు పండుతాయి. ఇళ్ళు కళకళలాడతాయి. మన ఆకలి తీరుతుంది'.

'శాపానికి ఇరగడ సెబతన్నావా సోఁవీ!'

'అలాగ్గే అనుకో! నీవడిగట్టిన దుమ్ము నీ నోట పడరాదు. నువ్వు ఆకలితో అలమటించ కూడదు. శాప నివృత్తి చేస్తున్నాను.'

'పల్లెకు శాపం లేదు సోఁవీ- ఊరికే! ఊరికి శాపం తగిలింది. మీది ఊరేగా! మీకు నోటి కాడి కూడు ఈ సద్ది దక్కలేదు. నేను మేపే గొడ్డు ఊరివేగా! వాటికియ్యాల మేత లేదు. కటికి పస్తు. మనిసికీ గొడ్డుకీ మీ శాపం దగిలింది. ఈ శాపం మీ ఉసురు'.

రాజు పంచె విప్పి, మాటతో కలదిప్పి, గుడిసె నడి కొప్పుమీద కట్టాడు, స్వామి దోసిట్లోని దుమ్ము.

'అది శాపం' అన్నాడు స్వామి.

'కాదువరం' అన్నాడు రాజు.

పొద్దు ఏట వాలుతూ ఉంది.